పింఛన్ల తొలగింపుపై ఆందోళన





శ్రీకాళహస్తి: అంబేద్కర్ కూడలి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొలగించిన వికలాంగుల పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పింఛన్ల తొలగింపుపై బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ, వికలాంగులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపి పెన్షన్లు తొలగించడం శోచనీయమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఇస్తున్న పెన్షను కూడా తీసివేయడం దారుణమని నిరసించారు. పెన్షన్లను పునరుద్ధరించకపోతే బాధితులతో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఆర్.గోపి, పట్టణ నాయకులు మురళి, జనార్దన్, మునిరాజా, మహిళా నాయకులు మునెమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగుల పింఛన్లను కొనసాగించండి

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం తాజాగా రద్దు చేస్తున్న దివ్యాంగుల పింఛన్లను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంబాకం



వరదయ్యపాళెంలో..

చిన్నిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం బస్టాండ్ ఆవరణలో నిరసన తెలిపారు. తిరుపతి జిల్లాలో 30 వేలకు పైగా దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసినట్లు నోటీసులు అధికారులు జారీ చేస్తున్నారు. ఇది దుర్మార్గపు చర్య అని వారు అభివర్ణించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగార్జున, సిద్ధలయ్య తదితరులు ఉన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..త

బుచ్చినాయుడుకండ్రిగ: అనర్హుల పేరిట తొలగించిన దివ్యాంగుల పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల పింఛన్లు అందుకున్న దివ్యాంగులకు ఒక్కసారిగా అనర్హులు అంటూ నోటీసులు ఇవ్వడం దారుణమని తెలిపారు. వీటిని గ్రామ పంచాయతీ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకే అతికించడం సిగ్గు చేటన్నారు. 20 ఏళ్లగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు కూడా నోటీసులు ఇవ్వడం అన్యాయమని ప్రశ్నించారు. గతంలో వైద్యులు 80-90 శాతం వికలత్వం ఉన్నట్లు గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తే ప్రభుత్వం మారిందని వికలత్వం తగ్గిపోయిందన్నారు. అధికారులు దివ్యాంగుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని, వారి పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

భౌ.. బోయ్..!



జయరావువీధిలో ఉన్న కుక్కలు

శ్రీకాళహస్తిలో రోజురోజుకూ కుక్కల బెడద పెరిగిపోతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. మున్సిపల్ అధికారులు వీధి కుక్కల సమస్య మీద దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –తొట్టంబేడు

క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీలు



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లుత

రేణిగుంట: సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ వాస్తవ్, గుంతకల్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా బుధవారం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ నాయకులు జీఎంను సన్మానించి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తమకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ డాక్టర్ గుమ్మడి జయంత్ కుమార్, రేణిగుంట బ్రాంచ్ చైర్మన్ హసన్ సాహెబ్, సర్పంచ్ నగేష్, వెంకటరమణ, గురుమూర్తి, షమీ ముల్లా, అబ్దుల్ సలీం, రాజేంద్రప్రసాద్, రాజేంద్రన్, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయం వద్ద సంజీవకుమార్ తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఢిల్లీ ప్రభుత్వ అదనపు కార్యదర్శి, ఆహార సరఫరా, వినియోగదారుల వ్యవహారాల కమిషనర్ సంజీవకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

హరియాణా మండలాధీశుడు..

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దేశంలోని 18 మండలాధీశుల్లో ఒకరైన హరియాణాకు చెందిన సోమువీర్‌బాబు కాళిదాసు తన శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికిస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఐడీబీఐ బ్యాంకు వితరణ



టేబుళ్లను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

రేణిగుంట: మండలంలోని వెంకటాపురం పంచాయతీ అన్నాస్వామిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు బుధవారం తిరుపతి ఐడీబీఐ బ్యాంకు రూ.70వేలు విలువ చేసే13 టేబుళ్లను వితరణ చేసింది. ఏజీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ హెడ్ రమేష్, మేనేజర్ బీవీ శరత్ వీటిని టీచర్లకు అందజేశారు. రీజినల్ హెడ్ సాయికృష్ణ ఆదేశాల మేరకు సీఎస్ఆర్ నిధులతో తమ వంతు సాయంగా ఈ వితరణ చేసినట్టు చెప్పారు. బ్యాంకు ఉద్యోగులను టీచర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జూలియస్ రాజు, ఉపాధ్యాయులు శోభారాణి, శశికళ, మునిమనోహర్, యాగయ్య, నాగమ్మ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు .

ఆడిట్ నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

సత్యవేడు: మండలంలోని 28 పంచాయతీలకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ త్రివిక్రమరావు కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఆడిట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆడిట్‌పై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆడిటింగ్ అధికార బృందానికి పంచాయతీ ఆదాయ వ్యయాలకు సంబంధించి రికార్డులు, బిల్లులను పూర్తిస్థాయిలో సమర్పించి పూర్తి చేయాలని సచివాలయ కార్యదర్శులను కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి ఆదాయ వ్యయాలను ఆడిటింగ్ అధికార బృందం పరిశీలిస్తారన్నారు. జిల్లా అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి రామకృష్ణ, పార్వతి, సాయిశంకర్, అయ్యప్ప, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



శ్రీకాళహస్తి: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బత్తెయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేరుగా జయంతి నిర్వహించారు. భారతదేశ సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ అని స్మరించారు. ఈ వేర్వేరుగా కార్యక్రమాల్లో జనార్దన్‌రెడ్డి, గోపి, సురేష్, అనిల్ నాగూరయ్య, మోహన్, ఆర్ముగం, నరేంద్ర, వాణెమ్మ, భానమ్మ, మస్తానమ్మ, పుష్ప, సీతారాం, నాగరాజు, లోకేష్ పాల్గొన్నారు.

భూఆక్రమణదారుడిపై కేసు నమోదు

సత్యవేడు: నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి అమాయక ప్రజల భూములను తమ పేరుతో రిజిస్టర్ చేయించుకుని తద్వారా భూయజమానులను కోర్టు చుట్టూ తిప్పుతున్న మోసగాళ్లను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి.అరుణాచలం, సీపీఎం మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ నాయకులు, బాధితులు కలసి సత్యవేడు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా కేవీపీఎస్ నాయకుడు అరుణాచలం మాట్లాడుతూ పేరడం గ్రామానికి చెందిన మది అనే వ్యక్తికి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన సొంత భూమిని శిరణంబూదూరుకు చెందిన కుమార్ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి తన భార్య పేరిట భూమిని రిజిస్టర్ చేయించుకున్నాడని ఆరోపించారు. నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ అధికారులను, రిజిస్ట్రేషన్ అధికారులను బురిడీ కొట్టించిన కుమార్‌ను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వారు ఎస్ఐ రామస్వామికి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మురళి, కృష్ణయ్య, మునస్వామి, అమ్ములు, రోసిలిన్ మది, సుశీల తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా ప్రదోష పూజలు



ప్రదోష మండపంలో నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీసర్వమంగళ సమేత శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఓం నమఃశ్శివాయ శివ నామస్మరణతో ఆలయాన్ని మార్మోగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదాలు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డెయిరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచండి



విద్యార్థులకు అక్షరాలు నేర్పుతున్న ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం సూచించారు. ఆయన బుధవారం గాజులపెళ్లూరు గ్రామంలో పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి టీచర్లకు, భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి, విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడంతో పాటు, రాయడం వంటి నైపుణ్యాలను మెరుగు పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సిపాయి భరోసా' పంపిణీ



సిపాయి భరోసా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పంచాయతీ మిట్టఇండ్లులో మృతి చెందిన మహేష్ కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పరామర్శించారు. మహేష్ చిత్రపటానికి నివాళి అర్పించి, సిపాయి భరోసా కింద 60 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన ప్రియ, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, బాలాజీ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, వినోద్ , వెంకటేష్, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై నిరసన



సీఆర్ఎస్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రేణిగుంట: ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులను తొలగించడం శోచనీయమని సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీఆర్ఎస్ వర్క్ షాప్‌లో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న 30 మంది రైల్వే కాంట్రాక్టు కార్మికులను తొలగించడంతో బుధవారం మిగిలిన 30 మంది కార్మికులు విధులు బహిష్కరించి సీఐటీయూ నాయకులతో కలసి ఆందోళన చేశారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి పీ.మునిరాజా మాట్లాడుతూ, రైల్వే యాజమాన్యం, కాంట్రాక్టర్ కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సెల్వరాజ్, ఈశ్వరి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అమ్ములు, మునెమ్మ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి: ఇన్‌స్పైర్ నామినేషన్లను వేగవంతం చేయాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ ఆదేశించారు. పుత్తూరు డివిజన్‌లోని అన్ని యాజమాన్యాల సైన్సు టీచర్లకు ఇన్‌స్పైర్ వార్డు -2025 నామినేషన్లపై ఒకరోజు శిక్షణ బుధవారం స్థానిక జెడీ బాలుర హైస్కూల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. ప్రతి పాఠశాలలో ఇన్నోవేషన్ ఐడియా బాక్స్‌ ఏర్పాటు చేయాలని, ప్రతి స్కూల్ నుంచి విద్యార్థుల వినూత్న ఆలోచనలతో కూడిన ఎగ్జిబిట్లతో 5 నామినేషన్లు చేయించాలని కోరారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్లు వీరేష్, ప్రేమకుమార్ అగస్త్య వర్చువల్ స్కూల్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు భువనేశ్వరి, భారతి, హెచ్ఎంలు వెంకటయ్య, రిసోర్స్ పర్సన్లు కామాక్షయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, లింకన్, రుద్రయ్య, మూర్తి, స్టాలిన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు



సీఐ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న కోగిలి మునిచందు తదితరులు

శ్రీకాళహస్తి: మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు చిత్తు అవుతున్నాయని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సీఐ మాట్లాడారు. యువతలో చాలా మంది మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారని, దీనిమూలాన భారీమూల్యం చెల్లించాల్సి వస్తోందన్నారు. చిన్నతనంలోనే ప్రాణాలు కోల్పోవడం, మతిస్థిమితం లేకుండా చేయరాని తప్పులు చేసి నేరస్తులుగా మారుతున్నారన్నారు. విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని హితోక్తులు పలికారు. అనంతరం సీఐని సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి, వార్డెన్ సుమన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లకు గిరిజనుల ఇక్కట్లు



తసర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న రామిరెడ్డిపాళెం గిరిజనులు

వరదయ్యపాళెం: నివేశన స్థలాలు ఉన్నప్పటికీ వాటి హక్కు పత్రాల కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఆ మేరకు మండలంలోని రామిరెడ్డిపాళెం గిరిజన కాలనీలో సొంతంగా నివేశన స్థలాలు ఉన్నప్పటికీ వాటికి పొజిషన్ సర్టిఫికెట్లు (హక్కు పత్రాలు) లేక, అటు ప్రభుత్వం నుంచి సొంతిల్లు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

కాట్రపల్లి ఆలయంలో చోరీ





సీసీ కెమెరాలో నమోదైన నిందితుడు, చోరీ జరిగిన ఆలయం

- రూ.10 లక్షల అమ్మవారి ఆభరణాలు, నగదు అపహరణ



పొలాల్లో పడేసిన హుండీ

వరదయ్యపాళెం: కేవీబీ పురం మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి సుమారు రూ.10 లక్షలు విలువైన అమ్మవారి ఆభరణాలు, నగదు, హుండీని దోచుకెళ్లారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంలో అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలయంలో కొద్ది రోజుల ముందే ఉత్సవాలు జరిగాయని ఉత్సవాల్లో భాగంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు అందించిన బంగారు ఆభరణాలు, నగదు, హుండీలోని నగదును దొంగలు అపహరించారని తెలిపారు. ఆలయంలో చోరీ చేసిన సొమ్ము, హుండీ, త్రిశూలం వంటి వస్తువులను దొంగలు ఎత్తుకెళుతున్న దృశ్యాలు స్థానికంగా ఉన్న ఇంటి సీసీ కెమెరాలో నమోదయ్యాయని తెలిపారు. ఆలయ కమిటీ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన ఆలయ హుండీ స్థానిక పొలాల్లో దొంగలు పడేసినట్లు గుర్తించారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



రాజశేఖర్

నారాయణవనం: మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలను నిర్మించుకోవాలన్నారు. ఉత్సవాల్లో రాజకీయ పార్టీల ప్రమేయంతో ఉద్దేశపూర్వకంగా పాటలు, ప్రకటనలను లేకుండా భక్తి పాటలతో పండుగ జరుపుకోవాలన్నారు. రాత్రి 10.30 గంటల వరక మాత్రమే వినియోగించే సౌండ్ సిస్టంలకు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. అయిదు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు విగ్రహాల మండపాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు ముందస్తుగా నిమజ్జన రూట్ మ్యాప్ సమర్పించి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాజశేఖర్ సూచించారు.

సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోండి

సత్యవేడు: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో రాయితీతో ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని స్టేట్ బ్యాంకు మేనేజర్ సూర్యప్రకాష్ తెలిపారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వ్యాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలో వ్యాట్స్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్‌కు రూ.78 వేలు సబ్సిడీ అందుతుందన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటుకు భారతీయ స్టేట్ బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని, 6.5 శాతం తక్కువ వడ్డీతో రుణం పొందవచ్చన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు ప్రశంసలు



తిరుపతిలో కేవీబీపురం కేజీబీవీ విద్యార్థులు

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు ప్రశంసలు వెల్లువెత్తాయి. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బాలికల స్కౌట్స్ పెరేడ్‌పై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ప్రశంసలు కురిపించారు. ఆ బాలికలు తమకు రేపటి పోలీసు, ఆర్మీ, నేవీ ఆఫీసర్లుగా కనిపిస్తున్నారని, వారిని అత్యద్భుతంగా, పటిష్టంగా తీర్చిదిద్దిన కెప్టెన్ (పీఈటీ) సావిత్రి, ఎస్ఓ సుకన్యను ప్రశంసిస్తూ ప్రశంసాపత్రాలను విడుదల చేశారు. దీంతో పాటు స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లను జారీ చేశారు. గతంలో కూడా కేజీబీవీ విద్యార్థుల స్కౌట్స్ పెరేడ్‌పై అప్పటి మంత్రులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు బార్లకు అనుమతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో నాలుగు బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిందని, దీనికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ లావణ్య మంగళవారం మీడియాకు తెలిపారు. వీటిలో ఒక బార్ గౌడ కులస్తులకు రిజర్వు చేశారని, బార్ లైసెన్సులకు ఈ నెల 26 లోపు దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. గౌడ కులస్తులకు కేటాయించిన బార్‌కు మాత్రం రూ.27.5లక్షలు ,మిగిలిన వార్లకు లైసెన్సు ఫీజు రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జనావాసాల్లోకి అడవి వానరం



సత్యవేడు వీధుల్లో సంచరిస్తున్న అడవి కోతి

సత్యవేడు: అటవీ ప్రాంతంలోని అడవి కోతి దారి తప్పి పట్టణంలోకి చేరి హల్‌చల్ చేసింది. బుధవారం కమ్యూనిటీ వైద్యశాల సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వారి చేతుల్లోని వస్తువులను లాక్కుంటూ, కరిచేందుకు యత్నించింది. దీంతో పాదచారులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. బాటసారులు భయపడ్డారు. కొంతసేపు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఇళ్లపై, రోడ్లపై గెంతులు వేస్తూ సందడి చేసింది. పలువురు అడవికోతిని సెల్‌ఫోన్లలో బంధించారు.

దోమల నియంత్రణపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నారాయణవనం: వర్షాలతో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్ రాజ్ సూచించారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతో వ్యాప్తి చెందే విషజ్వరాల లక్షణాలను, తీసుకోవల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి, చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: దోమకాటు ద్వారా వ్యాపించే వంటి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు జ్వరాలు, బోధకాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చినాయుడుకండ్రిగ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, జ్వరాలు అనాఫిలస్ అనే దోమ నుంచి వ్యాపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

పాలసముద్రం: ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, వీటి వలన దోమలు విజృంభించి మలేరియా, ఇతర విషజ్వరాలకు కారణమవుతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ జయకుమార్ అన్నారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని బుధవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మలేరియా, విషజ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సర్ రొనాల్డ్‌రాస్ సేవలను స్మరించారు. అనంతరం దోమల నిర్మూలనకు కలసికట్టుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది